ఇరిగేషన్ భూమి ఆక్రమణ

- నెలలు గడుస్తున్నా చర్యలు తీసుకోని అధికారులు
- విద్యుత్ సర్వీసు తొలగించిన సిబ్బంది



మండవల్లి మండలం పాత భైరవపట్నంలో ఇరిగేషన్ భూమిని ఆక్రమించి నిర్మించిన దుకాణాలు

మండవల్లి: ప్రభుత్వ భూముల్లో కబ్జాల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. రూ.కోట్ల విలువైన భూములను ఆక్రమించుకుంటున్నారు. పామర్రు–దిగమర్రు జాతీయ రహదారి–216లో మండవల్లి మండలం పాత భైరవపట్నం రోడ్డు పక్కన సర్వే నంబరు 36లో సుమారు 60 సెంట్ల ఇరిగేషన్ భూమిని ఓ వ్యక్తి ఆక్రమించాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏకంగా 12 దుకాణ సముదాయాలు నిర్మించాడు. వాటిని అద్దెకు ఇస్తున్నాడు. ఇదే గ్రామంలో అనేక మంది ఇంటి స్థలాల కోసం దరఖాస్తులు పెట్టి ఎదురు చూస్తున్నారు. పేదలు గజం ఆక్రమిస్తే కేసులు నమోదు చేసి కోర్టులకు పంపించే అధికారులు రూ.కోట్ల ఖరీదు చేసే ఇరిగేషన్ భూమి ఆక్రమణపై చర్యలు తీసుకోవడం లేదు.

హెచ్చరిక బోర్డులతో సరి

జాతీయ రహదారి పక్కనే ఇరిగేషన్ భూమిలో అక్రమ నిర్మాణం చేస్తుంటే పట్టించుకోని ఇరిగేషన్, పంచాయతీ అధికారులు నిర్మాణాలు పూర్తయ్యి, అద్దెలకు ఇచ్చిన తర్వాత ఇది జలవనరుల శాఖ భూమి అని హెచ్చరిక బోర్డులు పెడుతున్నారు. నియోజకవర్గాల పునర్విభజనలో మండవల్లి మండలం ఏలూరు జిల్లాలో చేరింది. దీంతో అధికారులు తమ పరిధి కాదంటే తమ పరిధి కాదంటూ చేతులు దులుపుకునే ప్రయత్నం చేశారు. 'మొత్తం రోడ్డు పక్కన ఆక్రమణలన్నీ కూల్చండి.. అప్పుడు చూద్దాం' అంటూ ఆ అక్రమార్కుడు అధికారులతో వాదిస్తున్నాడు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా..

పాత భైరవపట్నం ఆక్రమణలపై సెప్టెంబరు 15న ఏలూరు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. ఆక్రమణదారుడికి పంచాయతీ నోటీసు సైతం అందించింది. ఇరిగేషన్ అధికారులు బోర్డులు పెట్టారు. అయినా అక్రమార్కుడిలో ఏ మాత్రం భయం లేదు. ప్రభుత్వ భూములు అప్పనంగా కొట్టేసి అద్దెల రూపంలో లాభాలు దండుకుంటున్నా అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కాని పరిస్థితి.

తీర్మానం చేసి పంపమన్నారు



నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో ఇరిగేషన్ భూముల ఆక్రమణలకు గురైంది వాస్తవమే. భైరవపట్నం ఆక్రమణల విషయాన్ని ఇరిగేషన్ ఈఈకి తెలిపాం. నీటి సంఘాల అధ్యక్షులు ఆక్రమణలపై తీర్మానం చేసి నివేదిక పంపమన్నారు. త్వరలో ఆక్రమణలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– ఎం.శిరిష, ఇరిగేషన్ సబ్ డివిజన్ డీఈ, కైకలూరు

క్లుప్తంగా

ఉచిత మెగా వైద్యశిబిరం



పమిడిముక్కల: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి పేర్కొన్నారు. కూచిపూడి రవిప్రకాష్ సిలికానంద్ర సంజీవని వైద్యాలయం ఆధ్వర్యంలో చోరగుడి పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించారు. వైద్య శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన 120 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కందిమళ్ల సుబ్రమణ్యం, దండమూడి సుభాస్ చంద్ర బోస్ పాల్గొన్నారు.

విజయభాస్కర్‌కు గురుదేవోభవ పురస్కారం



గుడివాడ టౌన్ : స్థానిక విద్యాలయ స్కూల్ డైరెక్టర్ బొప్పన వెంకట విజయభాస్కర్‌కు గురుదేవోభవ పురస్కారం అందింది. ఇంటర్నేషనల్ టీచర్స్ డేను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ డెమొక్రటిక్ ఆధ్వర్యంలో శనివారం గుంటూరు ఎన్జీఓస్ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారం అందినట్లు విజయభాస్కర్ తెలిపారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ నుంచి ఈ పురస్కారం అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.మోహన్‌రావు, రాష్ట్ర కార్యదర్శి సురేందర్‌రెడ్డి, కృష్ణాజిల్లా శాఖ సభ్యులు పాల్గొన్నారు.

డ్రెయిన్ పనుల పరిశీలన



మండవల్లి: మండలంలోని కానుకొల్లులో సర్పంచ్ ఆధ్వర్యంలో శనివారం కచ్చా డ్రెయిన్ పనులు నిర్వహించారు. వర్షాలు కురుస్తున్న ప్రస్తుత తరుణంలో డ్రెయిన్‌లు సక్రమంగా ఉంటే డ్రెయినేజీ సమస్యలు ఉత్పన్నం కావని సర్పంచ్ నాగదాసి థామస్ పేర్కొన్నారు. ఈ కారణంగా డ్రెయిన్‌లను పూర్తి స్థాయిలో మరమ్మతులు దగ్గరుండి చేయిస్తున్నట్లు తెలిపారు.

భారీ అన్నసమారాధన



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా స్వామిని దర్శించుకునేందుకు శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో కార్యక్రమం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

రైతులకు మెరుగైన సేవలను అందించండి



పామర్రు: మార్కెట్ యార్డు ద్వారా రైతులకు మెరుగైన సేవలను అందించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. స్థానిక మార్కెట్‌యార్డు కమిటీ తొలి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మూడు వేల కోట్లతో మార్కెట్ స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసిందన్నారు. యార్డులో శిథిలావస్థకుచేరిన గోదాములను తొలగించి, కొత్త భవనాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఏఎంసీ చైర్మన్ జన్ను శోభన్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు స్వర్ణలత, ఏఎంసీ కార్యదర్శి శివ రామకృష్ణ, పి.శిరీషా, ఏఓ శివ నాగరాణి, ఏఎంసీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

బాణసంచా అక్రమంగా తయారు చేస్తే చర్యలు



బొమ్ములూరులో అక్రమంగా తయారు చేసిన టపాసులను స్వాధీనం చేసుకున్న రూరల్ పోలీసులు

గుడివాడరూరల్: దీపావళిని పురస్కరించుకుని బాణసంచా అక్రమంగా నిల్వ చేసినా, తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని గుడివాడ రూరల్ సీఐ ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు తెలిపారు. జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు, డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ పర్యవేక్షణలో మండలంలోని బొమ్ములూరులో శనివారం తెల్లవారు జామున కార్డెన్‌సెర్చ్ నిర్వహించి అక్రమంగా తయారు చేసిన నేల, ఉల్లిపాయ టపాసులను, వీటిని తయారు చేసేందుకు ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అనుమతులు లేకుండా టపాసులు తయారు చేయడం చట్టవిరుద్ధమన్నారు. గుడివాడ తాలూకా సర్కిల్ పరిధిలోని గుడివాడరూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో ఎక్కడైనా టపాసులు అక్రమంగా తయారు చేసి నిల్వ చేసినట్లు ప్రజలు గమనిస్తే వారి సమాచారం పోలీసు లకు అందించాలని కోరారు. కార్యక్రమంలో తాలూ కా ఎస్ఐ ఎన్.చంటిబాబు, గుడ్లవల్లేరు ఎస్ఐ పి.సత్యనారాయణ, ట్రెయినీ ఎస్ఐలు లోకేశ్వరి, కుమా ర్, పి.దుర్గా ఆంజనేయులు పాల్గొన్నారు.

రూ.40వేల విలువగల బాణసంచా స్వాధీనం

పెదపూడి(మొవ్వ): జిల్లా ఎస్పీ విద్యాసాగర్ ఆదేశాల మేరకు పామర్రు సీఐ వి.సుభాకర్ ఆధ్వర్యంలో కూచిపూడి ఎస్ఐ కేఎస్ విశ్వనాథ్ తన సిబ్బందితో దాడి చేసి, రూ.40వేల విలుగల బాణసంచా సామగ్రిని సాధ్వీనం చేసుకున్నారు. కూచిపూడి ఎస్ఐ కథనం మేరకు మొవ్వ మండలం పెదపూడిలోని ఓ గోదాములో లైసెన్స్ లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన దీపావళి బాణసంచాను శుక్రవారం రాత్రి మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా ఈ సామగ్రి గొట్టుపాటి సాయికి చెందినవిగా అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు ఎస్ఐ శనివారం పేర్కొన్నారు.

పశువైద్యశాలకు దారి ఏర్పాటు



పశువైద్యశాలకు వేసిన రహదారిని పరిశీలిస్తున్న కృష్ణారెడ్డి

పామర్రు: స్థానిక పశువైద్యశాల గోతుల మయంగా మారటంతో వైద్యశాలకు దారి ఏర్పాటుకు పాల సేకరణ కేంద్రం సౌజన్యంతో చర్యలు తీసుకున్నట్లు కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా ట్రస్టు బోర్డు జిల్లా సభ్యుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక పశువైద్య శాలకు ఏర్పాటు చేసిన రహదారిని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ పశువైద్యశాలకు సంబంధించిన దారి గుంతలమయంగా మారడంతో పశువులు వైద్యశాలకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. దీంతో మెరక పనులు చేపట్టాలని పశువైద్యశాల ఏడీ లక్ష్మీనారాయణ తమను కోరినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో స్థానిక పాల సేకరణ కేంద్రం నిధులు రూ.25వేలతో సుమారు 10 ట్రక్కుల రబ్బీషు, గ్రావెల్‌ను తోలించి రహదారి పనులను చేపట్టామన్నారు. పశువైద్యశాల అభివృద్ధికి ఎల్లప్పుడూ తమ వంతు సహాయ సహకారాలను అందజేస్తామని తెలిపారు. పాల సేకరణ కేంద్ర కార్యదర్శి ఆరేపల్లి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పుట్లమ్మ సత్రం నూతన భవన నిర్మాణానికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షురాలు గంగా భవానీ

పామర్రు: శిథిలావస్థకు చేసిన స్థానిక పుట్లమ్మసత్రం స్థానంలో నూతన భవనాన్ని నిర్మించేందుకు తగు చర్యలు తీసుకుంటామని సత్రం అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు ఆరుమళ్ల గంగా భవానీ పేర్కొన్నారు. స్థానిక పుట్లమ్మ సత్రంలో నూతన కమిటీ తొలి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సత్రం పూరాతన కాలంలో నిర్మించిన కారణంగా శిథిలావస్థకు చేరుతోందన్నారు. దీని స్థానంలో నూతన భవన సముదాయాన్ని ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులు తీర్మానించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు ఆర్‌కే విశాలాక్షి, అంజిబాబు, శివమల్లేశ్వరరావు, సుధాకర్, సుబ్రమణ్యేశ్వరమ్మ, నాగశిరోమణి, పావని తదితరులు పాల్గొన్నారు.

మద్యం బెల్టుషాపులను నియంత్రించాలి



ఐద్వా పతాకాన్ని ఎగురవేస్తున్న సంఘ నాయకులు

గన్నవరం: గ్రామాల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్న మద్యం బెల్టుషాపులను నియంత్రించాలని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు ముళ్ళపూడి కీర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక చింతపల్లి పాపారావు భవనంలో శనివారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మండల 16వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కీర్తి మాట్లాడుతూ గ్రామాల్లో బెల్టుషాపుల ద్వారా 24 గంటలు మద్యం విక్రయాలు చేస్తూ ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలు, చిన్నపిల్లలపై మానభంగాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతుందని విమర్శించారు. రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1,500 హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల అధ్యక్ష, కార్యదర్శులుగా సీహెచ్‌వీ.లక్ష్మి, కైలే స్వరూప, మరో ఏడుగురితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. తొలుత సంఘ పతాకాన్ని సీనియర్ నాయకురాలు మల్లేశ్వరి ఎగురవేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు మల్లంపల్లి జయమ్మ, బుద్ధవరం సర్పంచి బడుగు బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల జీర్ణోద్ధరణకు రూ.15 వేల విరాళం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి, శ్రీ గంగానమ్మ తల్లి దేవస్థానాల జీర్ణోద్ధరణ పనులకు శనివారం కాకాని రామకృష్ణ, కిరణ్ బిందు దంపతులు, వారి కుమారులు విశ్వతేజ, సాయి అఖిల్ రూ.15వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, డైరెక్టర్లు వల్లభనేని బుడ్డిబాబు, పోలవరపు వెంకట్రావు, దేవస్థాన ధర్మకర్తలు మురాల నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

14న మాస్టర్ ప్లాన్‌పై అభిప్రాయ సేకరణ

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు ప్రజలు అభిప్రాయాలు తెలపాలని కమిషనర్ షేక్ నజీర్ కోరారు. ఆయన శనివారం మాట్లాడుతూ మాస్టర్‌ప్లాన్ రూపొందించటానికి ప్రభుత్వం రెండు ప్రైవేటు సంస్థలకు బాధ్యతలు అప్పగించినట్లు ఏపీసీఆర్‌డీఏ కమిషనర్ తెలిపారన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 14వ తేదీన పోరంకి ద్వారకా రెసిడెన్సీలో ఉదయం 10.30 గంటలకు అభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మేధావులు, విద్యావేత్తలు, పట్టణ ప్రజలు, ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు, విలేకరులు పాల్గొని మాస్టర్ ప్లాన్‌కు సబంబంధించి సమాచారం, అభిప్రాయాలు తెలపాలని కమిషర్ నజీర్ కోరారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మేడికొండూరు: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పామర్రు మండలం ఉంగుటూరు గ్రామానికి చెందిన పాదాలు పెద్దిరాజు (46) తన కుటుంబంతో కలిసి వ్యవసాయ పనులు నిమిత్తం మేడికొండూరు మండలంలోని విశదల గ్రామానికి వలస వచ్చారు. భార్యాభర్తల మధ్య స్వల్ప వివాదం రావడంతో అతను మనస్తాపానికి గురయ్యాడు. పెద్దిరాజు రెండు రోజుల క్రితం పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు అతడ్ని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్యా పిల్లలు ఉన్నారు. ఘటనపై మేడికొండూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక

గన్నవరం: ఆలిండియా ఇంటర్ యూనివర్శిటీ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు గన్నవరం చైతన్య స్పోర్ట్స్ క్లబ్ క్రీడాకారిణి పుట్టా కీర్తి ఎంపికై నట్లు శిక్షకులు ధనియాల నాగరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7న మైలవరంలోని లక్కిరెడ్డి బాలిరెడ్డి డిగ్రీ కళాశాలలో కృష్ణా యూనివర్శిటీ అంతర్ కళాశాలల పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రజత పతకం సాధించిన కీర్తి కృష్ణా యూనివర్శిటీ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో నవంబర్ 1, 2 తేదీల్లో జరగనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్శిటీ పోటీల్లో కీర్తి పాల్గొంటుందన్నారు. వీకేఆర్ కళాశాలలో డిగ్రీ పథమ సంవత్సరం చదువుతున్న ఆమెను ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, పలువురు అధ్యాపకులు అభినందించినట్లు తెలిపారు.

శాంతి, సహనం పెంపొందించేందుకు కృషి



సత్కారం పొందిన పాస్టర్లతో శామ్యూల్

గుడివాడ టౌన్ : సమాజంలో శాంతి, సహనం, ప్రేమ తత్వాలను పెంపొందించడంలో దైవ సేవకులు సారథులుగా ఉంటారని కారుణ్య ఫౌండేషన్ అధ్యక్షుడు నేలపాటి శామ్యూల్ అన్నారు. శనివారం స్థానిక విజయవాడ రోడ్డులోని కారుణ్య ఫౌండేషన్ కార్యాలయంలో అంతర్జాతీయ దైవ సేవకుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యేసుక్రీస్తు ఈ లోకానికి ఇచ్చిన సందేశాలను సమాజం అర్థం చేసుకునేలా సేవకులు పని చేస్తారన్నారు. వారి సేవలను గుర్తించి వారిని గౌరవించడం తమ ఫౌండేషన్ బాధ్యతగా తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. అనంతరం దైవసేవకులను సత్కరించారు. కార్యక్రమంలో పాస్టర్లు లారెన్స్ శామ్యూల్, విద్యాసాగర్, జాన్‌కుమార్, ఫిలిప్, రత్నకిషోర్, జోసఫ్ రత్నకుమార్, చంద్రపాల్, కిరణ్‌గాంధి, ఎ. అబ్రహాం, సురేష్ పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ప్రజాపోరాటం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి



అన్నే వేణుగోపాల కృష్ణమూర్తి

పెనమలూరు: పేద విద్యార్థుల కోసం మాజీ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తీసుకు వచ్చిన మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలని చేస్తున్న యత్నాన్ని ప్రజా పోరాటంతో అడ్డుకుంటామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అన్నే వేణుగోపాలకృష్ణ మూర్తి తెలిపారు. ఆయన కానూరులో శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. పేద విద్యార్థులను డాక్టర్‌లుగా చేసి వారి కల సకారం చేయాలని జగనన్న ఎంతో కృషి చేసి రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు తీసుకు వచ్చారన్నారు. అందులో ఐదు కాలేజీలు పూర్తి చేసి తరగతులు ప్రారంభించారని అన్నారు. ప్రైవేటు మెడికల్ కాలేజీల వలన సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు ప్రజలకు ఉచితంగా అందుతాయన్నారు. అయితే కూటమి సర్కార్ వచ్చిన తరువాత ప్రైవేటు మెడికల్ కాలేజీలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. పైగా రాష్ట్రంలో ప్రైవేట్‌కాలేజీల నిర్మాణం జరగలేదని సీఎం చంద్రబాబునాయుడు బుకాయిస్తున్నారన్నారు. ప్రజా తిరుగుబాటు రాకముందే ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఆపి విద్యార్థులకు, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

చెరువులను తలపిస్తున్న రోడ్లు



మండవల్లి కైకలూరు వీధిలో నిలిచిన వర్షం నీరు

మండవల్లి: మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు తటాకాల మాదిరిగా మారాయి. కొల్లేటి గ్రామాలైన పెనుమాకలంక, నందిగామలంక, మణుగునూరు తదితర గ్రామాల్లో ఇటీవల వర్షాలకు రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. మండవల్లి నుంచి కైకలూరు, గుడివాడ తదితర పట్టణాలకు వెళ్లడానికి అనువుగా ఉండే కైకలూరు వీధి నుంచి రాకపోకలు సాగించడం నరకప్రాయంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. చిన్నపాటి వర్షానికి రహదారిపై గుంతలు నీటితో నిండి చెరువులను తలపిస్తున్నాయి. వాహన చోదకులు ప్రమాదాలకు గురై గాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ రహదారిని అభివృద్ధి చేసి సమస్యలు పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రహదారిపై వర్షం నీరు తొలగింపు



చినకామనపూడి రహదారిలో జేసీబీతో రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్

ముదినేపల్లి రూరల్: పంచాయతీరాజ్ రహదారిపై నిలిచిపోయిన నీరు తొలగించేందుకు చినకామనపూడి సర్పంచ్ చిట్టూరి నాంచారయ్య చొరవ తీసుకున్నారు. మండలంలోని చినకామనపూడి నుంచి మండవల్లి మండలం లింగాల వద్ద 165వ జాతీయ రహదారిని కలిపే మూడు కిలోమీటర్ల పొడవున ఉన్న పంచాయతీరాజ్ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి సైతం అవకాశం లేకుండా పోయింది. వారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో గుంతలలో నీరు నిలిచిపోయి ద్విచక్ర వాహనాలు వెళ్లడం లేదు. దీనిని గుర్తించిన సర్పంచ్ నాంచారయ్య జేసీబీని ఏర్పాటు చేసి రహదారి వెంబడి ఉన్న పంట కాల్వలోకి నీటిని మళ్లించేందుకు దారులు ఏర్పాటు చేశారు.

తపాలా సేవలందించడం అభినందనీయం



పామర్రులో పోస్టాఫీసు సిబ్బందిని సత్కరించిన కళాపీఠం సభ్యులు

పామర్రు: తపాలా కార్యాలయంలో ఉద్యోగం చేస్తూ ప్రజలకు సేవలు అందించడం అభినందనీయమని పామర్రు ఘంటసాల కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకటమురళీకృష్ణ పేర్కొన్నారు. స్థానిక పామర్రు పోస్టాఫీసులో పోస్టల్ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ సిబ్బంది సెల్‌ఫోన్ లేని కాలంలో ఉత్తరాల ద్వారా సమాచారాన్ని ప్రజలకు అందించి, వారి మన్ననలు పొందారన్నారు. ప్రస్తుత కాలంలో కూడా ప్రజలకు సేవలను అందిస్తూ కేంద్ర ప్రభుత్వ రాయితీలను ప్రజలకు చేరవేస్తోందీ సంస్థ అని అన్నారు. అనంతరం పోస్టు మాస్టర్ శ్రీనివాస్, సిబ్బంది నాగ సతీష్, ఆర్‌డీ ఏజెంట్ లలితాంబ, సిబ్బందిని సత్కరించారు. కళాపీఠం సభ్యులు నందిపాటి హేమంత్‌రెడ్డి, సల్మాన్ కొల్లాబత్తుల పాల్గొన్నారు.

ఆరోగ్యం, పరిశుభ్రత, పోషణపై శ్రద్ధ అవసరం



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సునంద

గన్నవరం: ఉంగుటూరు మండలం తేలప్రోలు సమీపంలోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం మహిళా సాధికారత, ఫిర్యాదుల సెల్ ఆధ్వర్యంలో ఆరోగ్యం, పరిశుభ్రత, పోషణపై అవగాహనలో భాగంగా అతిథి లెక్చర్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథి ప్రముఖ ప్రసూతి, స్త్రీ వ్యాధుల నిపుణురాలు డాక్టర్ సునంద మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో ఉన్నతంగా రాణిస్తున్నారని చెప్పారు. మహిళలు శక్తివంతంగా ఉండడం ద్వారానే వారి కుటుంబాలతో పాటు దేశం వేగంగా అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. ముఖ్యంగా మహిళలు ఆరోగ్యం, పరిశుభ్రత, పోషణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆరోగ్యవంతమైన జీవనం కోసం సమతుల్యమైన పోషకాహారం తీసుకోవాలని చెప్పారు. విద్యార్థుల మానసిక, ఆరోగ్య పరిరక్షణకు ఈ తరహా కార్యక్రమాలు దోహదపడతాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకేఎస్‌వీ.ప్రసాద్ తెలిపారు. మహిళా సాధికారిత, ఫిర్యాదుల సెల్ కో–ఆర్డినేటర్ ఆర్. భార్గవి తదితరులు పాల్గొన్నారు.

దీపావళి దుకాణదారులు జాగ్రత్తలు పాటించాలి



దీపావళి దుకాణదారులతో మాట్లాడుతున్న సీఐ రవికుమార్

కైకలూరు: దీపావళి దుకాణదారులు భద్రతా ప్రమాణాలు చేపట్టాలని కైకలూరు రూరల్ సర్కిల్ సీఐ వి.రవికుమార్ పేర్కొన్నారు. దుకాణదారులతో కైకలూరు సర్కిల్ కార్యాలయంలో అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రతి దుకాణానికి ఫాం ఎల్ఈ–5 లైసెన్స్ ఉండాలన్నారు. ఆటస్థలాలు, పాఠశాలలు, ఆస్పత్రులు, పెట్రోల్ బంకులకు కనీసం 50 మీటర్ల దూరంలో దుకాణాలు ఉండాలని పేర్కొన్నారు. తాత్కాలిక షెడ్లు మాత్రమే అనుమతిస్తామన్నారు. రెండు దుకాణాల మధ్య కనీస దూరం మూడు మీటర్ల దూరం ఉండాలన్నారు. హైటెన్షన్ లైన్లు, ఎల్‌పీజీ గోదాముల సమీపంలో ఉండకూడదన్నారు. ఇసుక, నీటి బకెట్లను దుకాణాల ప్రవేశ ద్వారం వద్ద ఉంచాలన్నారు.